బెల్టు షాపుల జోరు.. ప్రజల బేజారు

- నివాసాల మధ్యే విక్రయాలు
- రాత్రీపగలు మందుబాబుల హడావుడి
- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



రాత్రి సమయంలో ఇదీ పరిస్థితి

అల్లిపురం: 'ఇందుగలదందులేదని సందేహం వలదు.. ఏ వీధి వెతికినా అందే గలదు మద్యం' అన్నట్లు నియోజకవర్గంలో మద్యం ఏరులై పారుతోంది. అధికారుల అలసత్వంతో మద్యం మాఫియా వీధికో బెల్ట్ షాపు ఏర్పాటు చేస్తూ అందిన కాడికి దండుకుంటోంది. నివాస గృహాలు, చిన్న చిన్న పాన్ షాపుల్లోనూ కావలసినంత మద్యం దొరుకుతోంది. వైన్, బార్ షాపుల్లో సమయం ప్రకారం మద్యం లభ్యమవుతుండగా బెల్టు షాపుల్లో 24 గంటలు అందుబాటులో ఉంటోంది. ఎప్పుడంటే అప్పుడు.. ఏ బ్రాండ్ అంటే ఆ బ్రాండ్ వైన్ షాపుల మాదిరి ఇళ్లలోనే లభ్యం అవుతోంది. ఏ అర్ధరాత్రి అవసరమొచ్చినా తలుపు కొడితే చాలు వైన్ షాపులకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే పదో, పరకో ఎక్కువిస్తే ఇంటి పక్కనే మద్యం దొరుకుతోంది.

వైన్ షాపులకు అనుబంధంగా..

మద్యం విక్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో వైన్ షాపుల నిర్వాహకులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. అల్లిపురం, కొబ్బరితోట, నేతాజీనగర్, భూపేష్‌నగర్, చలువతోట తదితర ప్రాంతాల్లో కనీసం 20 నుంచి 30 వరకు బెల్టు షాపులు అనుబంధంగా పని చేస్తున్నాయి. తమ టార్గెట్లు చేరుకునేందుకు అల్లిపురం, కొబ్బరితోట, నేతాజీనగర్, జెండాచెట్టు, భూపేష్‌నగర్ తదితర ప్రాంతాల్లో బెల్టు షాపులను ఏర్పాటు చేయిస్తూ, అక్రమంగా మద్యం అమ్మకాలు సాగించేలా వైన్ షాపుల నిర్వాహకులే ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వైన్‌షాపుల నుంచి ఎమ్మార్పీ ధరలకు కొనుగోలు చేస్తున్న బెల్టు షాపుల నిర్వాహకులు ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ.20 అదనంగా వసూలు చేస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు.



అక్రమంగా సిట్టింగ్‌ల ఏర్పాటు..

బెల్టు షాపుల్లో సిట్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నా పట్టించుకునేవారు లేరు. ఆహార పదార్థాలు తయారు చేస్తూ మందుబాబులకు అందజేస్తున్నారు. బెల్టు షాపుల మధ్య పోటీ పెరగడంతో కస్టమర్లను ఆకర్షించేందుకు ఇళ్లలోనే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్ల మాదిరిగా బెల్టు షాపుల్లో చికెన్, మటన్, గుడ్లు, ఆమ్లేట్ తదితర ఆహార పదార్థాలను వండి అందజేస్తున్నారు.



ఇళ్ల మధ్యలో బీరు బాటిళ్లతో నిండిన ప్లాస్టిక్ ట్రే

నిద్రావస్థలో అబ్కారీ శాఖ..

విచ్చలవిడిగా బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు కొనసాగుతున్నా అబ్కారీ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అడ్డూ అదుపూ లేకుండా అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అదేమని అడిగితే లక్షలు, కోట్లు పెట్టి లైసెన్స్‌లు తీసుకున్నాం.. ఆ డబ్బులు ఎలా వస్తాయి? అని వ్యాఖ్యానిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. వైన్ షాపులు, బెల్టు షాపుల నుంచి మామూళ్లు అందుకుంటున్న అబ్కారీ శాఖ అధికారులు మద్యం మత్తులో జోగుతున్నారని బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



నేతాజీనగర్‌లో బెల్ట్ షాపు నడుస్తున్న ప్రాంతం

చాలా ఇబ్బందిగా ఉంది

జనావాసాల మధ్య బెల్ట్‌షాపులు నడపడం వల్ల చాలా ఇబ్బందిగా ఉంది. రాత్రీపగలు తేడా లేకుండా మందు కోసం క్యూ కడుతున్నారు. ఆడవారు ఉన్నారని కూడా చూడటం లేదు. పట్టించుకునే వారు లేరు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నక్కాన రాములమ్మ, నేతాజీనగర్

మా తలుపులు తడుతున్నారు

మందుబాబులు రోడ్ల మీదే తాగడం వల్ల నడిచేందుకు కూడా ఇబ్బందిగా ఉంది. మహిళలు అవస్థలు పడుతున్నారు. రాత్రీపగలు తేడా లేకుండా వస్తున్నారు. బోర్డులు లేకపోవటంతో ఇళ్ల తలుపులు తడుతున్నారు. అధికారులు పరిశీలించాలి.

– శియాద్రి నూకాలమ్మ, కొబ్బరితోట

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబకు హారతి ఇస్తున్న అర్చకుడు శ్రీకాంత్‌శర్మ

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి శ్రావణలక్ష్మి పూజలు



శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు ఆదివారం 17వ రోజుకు చేరాయి. ఆదివారం ఈ పూజలో 12 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె.రాజేంద్రకుమార్, సహాయ ఇంజినీర్ డీవీఎస్ రామరాజు, పర్యవేక్షకుడు తిరుపతి రావు, వేదపండితులు, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మహిళకు భరోసా



మహిళకు ఆర్థిక సాయం చేస్తున్న ముత్తాబత్తుల రమేష్

అల్లిపురం: 2024 ఎలక్షన్‌లో వైఎస్సార్‌సీపీలో పని చేసిన 33వ వార్డుకు చెందిన మహిళ ఆరోగ్యం బాగులేదని వార్డు యూత్ నాయకులు బూర్ల చిన్నకు తెలియజేయటంతో వార్డు అధ్యక్షుడు ముత్తా బత్తుల రమేష్ పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్తానని తెలిపారు. వారితో పాటు సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్యనాయుడు, బూర్ల జ్యోతిక తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అల్పాహారం అందజేత



వృద్ధులకు అల్పాహారం అందజేస్తున్న బీజేపీ నాయకులు

డాబాగార్డెన్స్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జన్మదినం సందర్భంగా ఏవీఎన్ కళాశాల డౌన్ రోడ్డులో ఉన్న ప్రేమసమాజం కుష్ఠు నివారణ కేంద్రంలో వృద్ధులకు ఆదివారం అల్పాహారం అందజేశారు. బీజేపీ మైనార్టీ మోర్చా సీనియర్ నాయకుడు ఒ.అల్బర్ట్, పార్టీ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు, దళిత మోర్చా నాయకుడు దళమంతుల శ్రీనివాసరావు నేతృత్వంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏపీలో పెట్టుబడులు సున్నా



మాట్లాడుతున్న పల్లా దుర్గారావు

బీచ్‌రోడ్డు: ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు మంత్రి లోకేష్ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తామని చెప్పి దావోస్ వెళ్లినా, సింగపూర్ వెళ్లినా పెట్టుబడులు మాత్రం సున్నా అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు ఎద్దేవా చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. లోకేష్‌కు పబ్లిసిటీ చేసుకోవడం కోసం మాత్రమే విదేశాల్లో పర్యటిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోందన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తప్పుడు కేసులు నమోదు చేస్తూ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సీఎం తన బినామీ కంపెనీలకి వేల కోట్ల రూపాయల విలువైన భూములను కారుచౌకగా దోచిపెడుతున్నారని, రాష్ట్రం దోపిడీకి గురవుతోందన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ అవినీతే లక్ష్యంగా చంద్రబాబు పాలిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాలను విదేశీ పెట్టుబడిదారులు గుర్తించే రాష్ట్రానికి రావడానికి భయాందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రజలు కూటమి నాయకులను గమనిస్తున్నారని, అవకాశం వచ్చినప్పుడు సరైన రీతిలో బుద్ధి చెబుతారన్నారు.

బ్లాక్ డే పాటించిన క్రైస్తవులు



మాట్లాడుతున్న క్రిస్టియన్ మైనార్టీ కౌన్సిల్ ప్రతినిధి సుధాకర్

డాబాగార్డెన్స్: క్రైస్తవులు ఆదివారం బ్లాక్ డే పాటించారు. 1950 ఆగస్టు 10న అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ మతం మారిన దళితులకు దళిత హోదా రద్దు చేశారని, అప్పటి నుంచి దళితులు బ్లాక్ డే పాటిస్తున్నారని క్రిస్టియన్ మైనార్టీ కౌన్సిల్ చైర్మన్ ఎం.సుధాకర్, కార్యదర్శి జేమ్స్ కుంపట్ల తెలిపారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద బ్లాక్ డే పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ మతం నుంచి సిక్కు, బౌద్ధం ఇతర మైనార్టీ మతాల్లోకి మారిన దళితులకు 1956లో వెసులుబాటు కల్పించారని, హిందూ మతం నుంచి కేవలం క్రైస్తవ మతంలోకి మారే దళితులపై మాత్రమే వివక్ష కొనసాగుతుందన్నారు. 1971–77 మధ్య కాంగ్రెస్ పార్టీ క్రైస్తవ మతం స్వీకరించిన దళితులకు విద్య, ఉద్యోగ రంగాల్లో 1 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ, కార్పొరేషన్ లోన్లు, సబ్సిడీ, ఇళ్ల కాలనీలు, మంజూరు చేసినట్లు తెలిపారు. బ్లాక్ అంటే మతవివక్షగా క్రైస్తవులు భావిస్తారన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ ప్రచారం



స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా భూపేష్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

అల్లిపురం: స్మార్ట్ మీటర్లతో విద్యుత్ వ్యవస్థ అంతా అదానీ చేతిలోకి వెళ్లిపోతుందని సీపీఎం సీనియర్ నాయకుడు వై. రాజు అన్నారు. జగాంబ జోన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కర్ర చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం భూపేష్‌నగర్‌లో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు సెల్‌ఫోన్ రీచార్జి చేసుకునే విధంగా ముందుగానే చేసుకోవాలని, ఎక్కువ ఏ టైములో విద్యుత్ వాడతామో ఆ టైంలో యూనిట్ రేట్ ఎక్కువగా చూపిస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ స్మార్ట్ మీటర్లను ప్రజలందరూ వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇదే ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పెట్టిస్తే పగలగొట్టండి అని పిలుపునిచ్చిందన్నారు. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని స్మార్ట్ మీటర్లు పెట్టడానికి ప్రయత్నిస్తుందని ప్రశ్నించారు. భూపేష్‌నగర్ లో మహిళలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని సీపీఎం ఇచ్చిన స్టిక్కర్లను స్వచ్ఛందంగా వాళ్ల మీటర్ పక్కనే అంటించి ఎట్టి పరిస్థితుల్లో స్మార్ట్ మీటర్లను అనుమతించబోమని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జగదాంబ జోన్ కన్వీనియన్స్ కమిటీ కన్వీనర్ ఎం. సుబ్బారావు పాల్గొన్నారు.

శబరిమలలో నిత్యాన్నదానానికి ఏర్పాట్లు



ట్రస్టు సమావేశంలో పాల్గొన్న పైలా ఆదిమోహన్‌రెడ్డి, ఇతర సభ్యులు

సీతంపేట: విశాఖలో నూతనంగా ప్రారంభించిన అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మండల, మకర జ్యోతి సీజన్లలో శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం అక్కడ నిత్యాన్నదానం నిర్వహించనున్నట్లు ట్రస్టు సభ్యుడు పైలా ఆదిమోహన్‌రెడ్డి తెలిపారు. శంకర మఠంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అయ్యప్ప భక్తులతో ట్రస్టు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు ద్వారా చేపట్టబోయే సేవా కార్యక్రమాలను వివరించారు. ప్రతి ఏటా నవంబర్ 16 నుంచి జనవరి 17 వరకు శబరిమలలో తమ ట్రస్టు తరఫున నిత్యాన్నదానాన్ని మూడు పూటలా నిర్వహిస్తామని చెప్పారు. భక్తులకు వైద్య సేవలందించేందుకు వీలుగా ఒక అంబులెన్స్ అందుబాటులో ఉంచుతామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఇతర రాష్ట్రాల వారికి బోర్డు సభ్యులుగా స్థానం కల్పిస్తున్న విధంగా తెలుగు రాష్ట్రాల వారికి ట్రావెన్‌కోర్ బోర్డులో అవకాశం కల్పించాలని కోరారు. ఇరు రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ట్రావెన్‌కోర్ బోర్డును కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రుద్ర కోటేశ్వరరావు, రాజేష్ గౌడ్, అనంతరావు, వైకుంఠరావు, శ్రీహరి, మస్తాన్‌రెడ్డి, రమణ, వీరాస్వామి పాల్గొన్నారు.

జూలో సింహాలపై అవగాహన



వెటర్నరీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న క్యూరేటర్ మంగమ్మ

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో ప్రపంచ సింహాల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూ బయోస్కోప్‌లో నిర్వహించిన సమావేశంలో సందర్శకులు, వెటర్నరీ విద్యార్థులకు సింహాలపై అవగాహన కల్పించారు. క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ పర్యావరణంలో సింహాల ప్రాధాన్యం, జూ పార్కుల్లో వాటి సంరక్షణ చర్యలను వివరించారు. జూ పార్కులో ఒక జత సింహాలున్నాయన్నారు. వాటి సంరక్షణకు నిరంతరం జూ వెటర్నరీ సిబ్బంది, యానిమల్ కీపర్లు జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. వాటికి అందిస్తున్న వైద్య సేవలు, ఆహారం, జాగ్రత్త చర్యలను వివరించారు. ఇటీవల జూలో ఒక సింహాన్ని వివేక్ గోయంకా అనే వ్యక్తి దత్తత తీసుకున్నారన్నారు. మిగిలిన వన్యప్రాణులను కూడా దత్తత తీసుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఆమె కోరారు. దత్తత తీసుకున్న వారికి ఆదాయ పన్నులో 50 శాతం వరకు మినహాయింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జూ అసిస్టెంట్ క్యూరేటర్లు బి.గోపి, పి.వి. చౌదరి, వెటర్నరీ వైద్యుడు పి.భానుబాబు, సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వినాయక చవితికి రాట ఉత్సవాలు

ఆరిలోవ: ఆరిలోవలో వినాయక చవితి ఉత్సవాలకు సన్నాహాలు చేస్తున్నారు. కాలనీల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయడంలో భాగంగా పందిరి రాట ఉత్సవాలు జరుపుతున్నారు. జీవీఎంసీ పదమూడో వార్డులో పలుచోట్ల ఆదివారం రాట ఉత్సవాలు నిర్వహించారు. వార్డు పరిధి పాండురంగాపురంలో కాలనీ యూత్ ఆధ్వర్యంలో పందిరి రాట వేశారు. కార్యక్రమంలో కెల్ల సత్యనారాయణ, కె.శిరీష, ప్రసంగి వాసు, పాండురంగాపురం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం



శిక్షణ పొందిన విద్యార్థులతో సీఐ జీడీ బాబు

అల్లిపురం: క్రీడలు ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయని వన్‌టౌన్ సీఐ జీడీ బాబు అన్నారు. ఆదరణ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన వేసవి క్రికెట్ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందిన వారు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జాతీయ మానవ హక్కుల చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ నిరంతర క్రీడా సాధనతో ముందుకు సాగాలన్నారు. ఎందరో విద్యార్థులకి శిక్షణ ఇస్తున్న కోచ్ సూర్య ప్రకాశ్‌కి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాశ్, కె.వి.ఎస్. ట్రస్ట్ ఫౌండర్ కోన శంకర్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, గణేశ్, కృష్ణ, దుర్యోధన, ఈశ్వర్, జయరాజ్, అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహేష్‌బాబు అభిమానుల సేవా కార్యక్రమాలు



మహేష్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

డాబాగార్డెన్స్: సూపర్‌స్టార్ మహేష్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు ఆదివారం పేదలకు పండ్లు, చీరలు పంపిణీ చేశారు. బుజ్జి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి పాల్గొని మహేష్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. తన వంతుగా ఎంతో మంది పేద చిన్నారులకు గుండె శస్త్ర చికిత్సలు ఉచితంగా చేయించి, తల్లిదండ్రుల గుండెల్లో ప్రిన్స్‌గా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, ఎర్నిమాంబ ఆలయ కమిటీ చైర్మన్ లండా రమణ, పార్టీ నాయకులు, సూపర్‌స్టార్ కృష్ణ అండ్ మహేష్‌బాబు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాలపై ఇంటింటా ప్రచారం



33వ వార్డులో బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న ముత్తాబత్తుల రమేష్ తదితరులు

అల్లిపురం: ఆదివారం 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా గడపగడపకీ వెళ్లి ప్రజలకు బాబు మోసాల గురించి వైఎస్సార్‌సీపీ నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలింగ్ బూత్ 61 పరిధి పార్టీ సీనియర్ నాయకులు పచ్చిరపల్లి రాము, వెంకటేశ్వర స్వామి టెంపుల్ మాజీ చైర్మన్ ఆడారి వెంకట మహేష్, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్యనాయుడు, ధర్మ, పీవీఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి, మత్స్యకార నాయకుడు చోడిపల్లి శివకుమార్, పాల దామోదరరెడ్డి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న 29వ వార్డు నాయకులు

29వ వార్డులో..

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డులో ఆ వార్డు అధ్యక్షుడు పీతల వాసు నేతృత్వంలో ఆదివారం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధి ఊటగెడ్డలో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలు వివరించారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కనకల ఈశ్వర్, బెవర మహేష్, కొండ్రు సతీష్, బొండాడ వెంకట్రావు, ఆకుల శ్యామ్‌కుమార్, ఆరుగుల రాజ్‌కుమార్, కోట ప్రసాద్, లంకే మహేశ్వరి, పడాల సూర్యకుమార్, జి.శివ, పప్పు కమల, గండివలస పెంటయ్య, పీతల చరణ్, ఉమా మహేష్, గొలగాని మధు, జోగరాజు, వెంకట్రావు, గౌతం, రాజు, నొడగల శివ తదితరులు పాల్గొన్నారు.

సామరస్యంతోనే ప్రపంచ శాంతి



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్, నరవ ప్రకాశరావు

సీతంపేట: హిరోషిమా, నాగసాకి సంస్మరణ దినం సందర్భంగా ప్రపంచ శాంతిని కోరుతూ ఐఏఆర్ఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సదస్సు నిర్వహించారు. సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన ముందుగా మహాత్మా గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించి, ప్రపంచ శాంతిని కోరుతూ సర్వమత ప్రార్థనలు చేశారు. ఐఏఆర్ఎఫ్, యూఎస్‌వో ద్వారా ప్రపంచ శాంతి కోసం సభ్య దేశాల సహకారంతో నిరంతరం కృషి చేస్తోందని ప్రకాశరావు తెలిపారు. ఆచార్య వి.బాలమోహన్‌దాస్, డాక్టర్ నాగసూరి, వేణుగోపాల్, బ్రహ్మకుమారి రామేశ్వరి మాట్లాడుతూ వివిధ వర్గాలు, దేశాల మధ్య సామరస్యం సాధించిన నాడే ప్రపంచ శాంతి సాధ్యమన్నారు. 80 ఏళ్లుగా యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయని, ప్రపంచ శాంతి కోసం వాటిని మానుకోవాలని హితవు పలికారు. మానవాళికి కావాల్సింది అణుబాంబులు కాదని, అన్నం, వస్త్రం కావాలన్నారు. అనంతరం శాంతి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హంస్సేన్, చాట్ల బాబూరావు, రెడ్డి, కరుణ, నరసింహారావు పాల్గొన్నారు.

నాలుగు పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న పూర్వ ఎంపీ శంకరరావు, అతిథులు

సీతంపేట: విశాఖ సంస్కృతి ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం ఒకేసారి నాలుగు పుస్తకాలు ఆవిష్కరించారు. విశాఖ సంస్కృతి 13వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో అతిథుల చేతుల మీదుగా నాలుగు పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. రచయిత మోణంగి ప్రవీణ రచించిన తొలి అడుగులు కథా సంపుటి, గన్నవరపు నరసింహమూర్తి రచించిన మిథునం, గన్నవరపు నరసింహమూర్తి కథలు, మంచి సినిమాల పుస్తకాలను అతిథులు, పూర్వ ఎంపీ డి.వి.జి.శంకరరావు, గరివిడి పశు వైద్య శాల డీన్ డాక్టర్ మక్కెన శ్రీను, అఖిల భారత ధర్మకర్త చెరువు రామకోటయ్య, సత్య విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు ఆవిష్కరించారు. అనంతరం విశాఖ సంస్కృతి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ తెలుగు సాహిత్యం, తెలుగు భాష ఉన్నతికి 13 ఏళ్లుగా పాటు పడుతున్న విశాఖ సంస్కృతి మాస పత్రిక సంపాదకుడు శిరేల సన్యాసిరావు నిస్వార్థ కృషిని అభినందించారు. మంచి ఇతివృత్తం ఉన్న కథలు, సాహిత్యం, చారిత్రక అంశాలు, కవితలు ప్రతి నెలా అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన హాస్య కథలు, కవితల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రచయిత మేడా మస్తాన్‌రెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపం వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండప వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.